పాఠశాలల్లో ఆటల సందడి


క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు

- పంద్రాగస్టు వేళ.. విద్యార్థులకు పోటీలు


ఎన్‌జీజీవోస్ కాలనీ హైస్కూల్ మైదానంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

సీతంపేట: స్వాతంత్య్ర దినోత్సవం వస్తుందంటే పిల్లలకు సందడే. మూడు రోజుల ముందు నుంచే పాఠశాలల్లో విద్యార్థుల కోలాహలం కన్పిస్తుంది. వారికి ఉపాధ్యాయులు ఎన్నో రకాల ఆటల పోటీలు నిర్వహిస్తుంటారు. స్టూడెంట్ల ప్రతిభను ప్రదర్శించడానికి ఈ పోటీలు దోహదపడతాయి. ప్రతి ఏటా తరహాలో ఈ ఏడాది కూడా అక్కయ్యపాలెం ఎన్‌జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ విద్యార్థులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. శుక్రవారం పాఠశాలలో కబడ్డీ, వాలీబాల్, 100 మీటర్ల రన్నింగ్, క్రికెట్, మ్యూజికల్ చైర్, చెస్, క్యారమ్స్, ఫ్లాట్ రేస్ పోటీలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు సీనియర్, జూనియర్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని లక్ష్మీ నరస తెలిపారు. ఈ పోటీల్లో మొదటి మూడు స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆగస్టు 15న జరిగే స్వాతంత్య్ర దినోత్సవంలో అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని చెప్పారు. పాఠశాల పీడీ సునంద్ పోటీలను పర్యవేక్షిస్తున్నారు.

ప్రజా సేవలో పారదర్శకత

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 49వ వార్డులో ఉత్సాహంగా 'గడప గడపకు మన ప్రభుత్వం'


సంక్షేమ పథకాల కరపత్రాలు అందిస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ అల్లు శంకరరావు

మురళీనగర్: ప్రజా సేవలో పారదర్శకత పాటించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం 49వ వార్డు 1086285 సచివాలయం పరిధి ఎన్‌జీజీవోస్ కాలనీలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ అల్లు శంకరరావుతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి నివాసులకు కరపత్రాలు పంపిణీ చేశారు. వారి సమస్యలు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం జీవన ప్రమాణాలు మెరుగుపడాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో కొండవాలు ప్రాంత నివాసులు, మురికివాడల్లో నివసించే కుటుంబాలకు ఎటువంటి సదుపాయాలు ఉండేవి కావని, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రాంతాలకు అన్ని మౌళిక సదుపాలయాలు కల్పించామని వివరించారు. ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్ రాజు, డైరెక్టర్లు ఎస్.రవికుమార్, జేసీఎస్ మండల కన్వీనర్ అమర్‌రెడ్డి, 49వ వార్డు నాయకులు ఆదిరెడ్డి శ్రీను, చంద్రశేఖర్, ఢిల్లీరావు, ఆర్.చిన్నారావు, శకుంతల, సబ్బవరపు శ్రీను, కె.మంగ, ఎస్.కనక, భవానీశంకర్, పల్లా చైతన్య, పావని, ఈశ్వరరావు, అప్పలనాయుడు, సిహెచ్.శ్రీను, జి.కన్నయ్య, బాబు, వినయ్, సీనియర్ నాయకులు కృష్ణారావు మాస్టర్, బోగవల్లి గోవింద్, షేక్ బాబ్జి, కె.చిన్నా, జి.వెంకటేష్, అశోక్, సారిపిల్లి సంతోష్, ఎన్‌జీజీవోస్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పార్వతీశం, వైస్ ప్రెసిడెంట్ పి.బలరామస్వామి, కార్యదర్శి కె.రామచంద్రరాజు, డైరెక్టర్లు ఎన్.సాంబశివరావు, రాజారావు, జీవీఎంసీ అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవ వేంకటేశ్వరుడికి నేడు సుప్రభాత సేవ



మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నారు. తెల్లవారు జామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

'ఆర్టీఐ-షిప్' విశాఖ అర్బన్ అధ్యక్షుడిగా బోర రవి


బోర రవికుమార్‌రెడ్డికి నియామక పత్రం అందిస్తున్న పరవాడ రవి

సీతమ్మధార: సమాచార హక్కు చట్టం-2005, సమాచార హక్కు ఐక్య ప్రచారవేదిక(షిప్) విశాఖ అర్బన్ అధ్యక్షుడిగా నక్కవానిపాలేనికి చెందిన బోర రవి కుమార్‌రెడ్డి నియమితుదయ్యారు. ఈ మేరకు శుక్రవారం నక్కవానిపాలెంలో జరిగిన ఒక కార్యక్రమంలో షిప్ ఫౌండర్, ప్రెసిడెంట్ పరవాడ రవి చేతుల మీదుగా రవికుమార్‌రెడ్డికి నియామక పత్రం అందుకున్నారు.

నేడు బుర్రకథ ప్రదర్శన


బుర్రకథ బృందం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం బుర్రకథ ప్రదర్శించనున్నారు. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జానపద కళలను ప్రోత్సహించడం, నేటి తరానికి వాటిని పరిచయం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ నెలవారీ సమావేశం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు స్వాతంత్య్ర సంగ్రామంలో అమరవీరుల విజయగాథ అనే అంశంపై శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం మురపాక గ్రామానికి చెందిన శ్రీనివాస బుర్రకథ దళం సభ్యులు బుర్రకథ ప్రదర్శిస్తారని, స్థానికులు, వాకర్స్ తిలకించాలని వారు కోరారు.

కృష్ణా జూనియర్ కాలేజీ విద్యార్థికి విట్‌లో సీటు


సనపల సాయిమణి

మద్దిలపాలెం: తమ కళాశాల విద్యార్థి సనపల సాయిమణి అమరావతిలోని ప్రతిష్టాత్మకమైన వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(విట్)లో ఉచిత సీటు సాధించాడని డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. ఇది తమ కళాశాలకు గర్వకారణమన్నారు. 2022–23 విద్యా సంవత్సరానికి జగనన్న ఆణిముత్యాలు కింద సాయిమణి రూ.15 వేల నగదు పొందాడని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థి సాయిమణిని కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించి అభినందించింది. కళాశాల ఎన్‌సీసీ అధికారి సన్యాసినాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాహిత్యంతోనే సామాజిక చైతన్యం


మాట్లాడుతున్న శిరేల సన్యాసిరావు

తాటిచెట్లపాలెం: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శుక్రవారం విశాఖ సంస్కృతి మాసపత్రిక 11వ వార్షికోత్సవం, మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ 9వ సాహిత్య పురస్కారాల ప్రదాన వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాంకీ ఫౌండేషన్ ప్రెసిడెంట్, కవి, కథా రచయిత ఎం.వి.రామిరెడ్డి మాట్లాడుతూ సాహిత్యంతోనే సామాజిక చైతన్యం ఏర్పడుతుందన్నారు. కందుకూరి, గురజాడ, శ్రీశ్రీ వంటి అభ్యుదయ కవులు తమ సాహిత్యం ద్వార ప్రజలను చైతన్యపరిచారన్నారు. ఇటువంటి కవుల రచనలు ప్రజలకు చేరువ కావడానికి సాహిత్య పత్రికలే కారణమన్నారు. గరివిడి కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ ప్రొఫెసర్ డాక్టర్ మక్కెన శ్రీను తన తండ్రి పేరిట ఏర్పాటు చేసిన శ్రీ మక్కెన రామ సుబ్బయ్య ఫౌండేషన్ 9వ సాహిత్య పురస్కారాలతో ఎంపికైన ఆరుగురు రచయితలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు, నగదు అందజేశారు. బాలల కేటగిరిలో కథ, గేయ, కవిత ప్రక్రియల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలైన శివాజీపాలెం జీవీఎంసీ పాఠశాల విద్యార్థులకు గౌరవ అతిథి డాక్టర్ మజ్జి శశిభూషణరావు ప్రశంసా పత్రాలు అందించారు. విశాఖ సంస్కృతి మాసపత్రిక సంపాదకుడు శిరేల సన్యాసిరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, అడపా రామకృష్ణ, ఆచార్య వెలమల సిమ్మన్న, డి.వి.సూర్యారావు, జె.వి.శర్మ, ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన పలువురు కవులు, రచయితలు, సాహితీ ప్రియులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రంలో జెండా పండగకు ఏర్పాట్లు



సుబ్బలక్ష్మీనగర్ యూపీహెచ్‌సీలో జెండా ఎగరేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 41, 42 వార్డుల పరిధి రైల్వే న్యూకాలనీ సుబ్బలక్ష్మీనగర్‌లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వాతంత్య్ర దిన వేడుకలకు సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. ఆరోగ్యం కేంద్రంలో వైద్యాధికారి ఎ.దివ్య సూచనలతో జాతీయ జెండాను ఎగురవేసేందుకు శుక్రవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో యూపీహెచ్‌సీ సిబ్బంది డి.సుధీర్‌రాయ్, బి.ప్రత్యూష, కుంబ్లి, రూత్ సీలి, ఎస్.వి.నాగలక్ష్మి, వై.స్వాతిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రైడేతో దోమల నిర్మూలన


దోమలు పెరిగే ప్రదేశాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: వారం రోజులకు పైగా నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతాయని జీవీఎంసీ, మలేరియా సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఫ్రైడే–డ్రైడే సందర్భంగా జగన్నాథపురం మూడు గుళ్ల వద్ద స్థానిక మహిళలకు దోమల నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వర్షా కాలం దృష్ట్యా ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. నీటిని నిల్వ చేసే గోళాలు, కుండీలు, సంపులు, ట్యాంకులు, మనీ ప్లాంట్లు, ఫ్రిజ్ వెనుక డ్రిప్‌బాక్సును శుభ్రపర్చి మళ్లీ నీరు పట్టుకోవాలని సూచించారు. గోళాలు, కుండీల్లోకి దోమలు చొరబడకుండా మూతలు పెట్టాలన్నారు. ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని చెబుతూ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కుమార్, ఏఎన్‌ఎం లత, ఆశా కార్యకర్త శిరీష, మలేరియా సిబ్బంది నూకరత్నం, సిహెచ్.కుమారి, అప్పలకొండ పాల్గొన్నారు.

ఉద్యోగాల కల్పనలో విఫలం


రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: గత ఎన్నికల సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన నిరుద్యోగుల నియామక అంశాన్ని తుంగలో తొక్కి పరిపాలన సాగిస్తున్నాయని పలువురు వక్తలు ఆరోపించారు. ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా.. సహజ వనరులతోపాటు మానవ వనరుల అభివృద్ధి ఎంతో ముఖ్యమన్నారు. కేంద్రంలో మోదీ సర్కారు అధికారంలోకి వచ్చాక మేకిన్ ఇండియా, స్కిల్ ఇండియా కింద ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, 2 కోట్ల మందికి శిక్షణ లక్ష్యంగా నాటి ఎన్నికల ప్రచారంలో ప్రకటించారని, వాటి అమలు చేయడంలో వైఫల్యం చెందారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ద్వారా నియామకాలు చేపడతామని చెప్పి, ఒక్క పోలీస్ తప్ప ఏ ఉద్యోగానికి ప్రకటన లేదని, నాలుగేళ్లలో సచివాలయం పోస్టులు తప్ప ఒక్క ఖాళీ పూరించలేదని విమర్శించారు. సమావేశంలో నాగార్జున విశ్వవిద్యాలయం మాజీ వీసీ ఆచార్య బాలమోహన్‌దాస్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గొంప గోవిందరాజు, ఏపీటీ మాజీ అధ్యక్షుడు కొయ్య ప్రసాదరెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఎల్.రామారావు, ఆప్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు, టీడీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆరేటి మహేష్, ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు, సూరప్పడు, జేటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల శ్రమదానం


విభాగాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం చరిత్ర, ఆర్కియాలజీ విభాగాన్ని శుక్రవారం విద్యార్థులు శ్రమదానంతో శుభ్రం చేశారు. విభాగంలోని మ్యూజియం, గ్రంథాలయం ప్రాంగణాలను శుభ్రపరిచారు. విభాగాధిపతి ఆచార్య సిహెచ్.మధుసూదనరావు ఆధ్వర్యంలో విద్యార్థులు విభాగాన్ని సుందరంగా తీర్చిదిద్దే పనులు నిర్వహించారు. ఏయూలో త్వరలో నాక్ బృందం పర్యటించనుంది, ఈ నేపథ్యంలో చారిత్రక ప్రాధాన్యం కలిగిన మ్యూజియాన్ని శుభ్రం చేసి విద్యార్థులకు ఉపయుక్తంగా తీర్చిదిద్దారు.

ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరి


గురుద్వారాలో తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు చేశారు. గురుద్వారా, ఆశీలమెట్ట, రామాటాకీస్, బాలయ్యశాస్త్రి లేఅవుట్ మొదలగు ప్రాంతాల్లో ట్రాఫిక్ రూల్స్ పాటించని చోదకులపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. భారీగా చలానాలు వసూలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ రామ్మూర్తి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, అతివేగం వద్దని సూచించారు.

భారీగా చలానాల వసూలు, కేసుల నమోదు

ఈ ఏడాది జనవరి నుంచి జూలై వరకు మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై 411 కేసులు నమోదు చేయగా.. 315 వాహనాలు విడుదల చేశామని, రూ.5,15,550 జరిమానా విధించామని ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. మోటార్ వెహికల్ కేసులు 23,906 నమోదు చేయగా.. రూ.1,30,315 ఫైన్‌లు వేసినట్లు చెప్పారు. హెల్మెట్ ధరించిన వారిపై 17,882 కేసులు నమోదు చేశామన్నారు. ట్రిపుల్ రైడింగ్, రాంగ్ పార్కింగ్, ట్రాఫిక్ రూల్స్ అధిగమించిన వారిపై 5,563 కేసులు, ఓవర్ లోడ్ 49 కేసులు, రూ.9,578 పెండింగ్ చలానాలు వసూళ్లు చేశామని చెప్పారు. మొత్తం రూ.17,92,456 వసూలు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వే ట్రాక్‌పై వ్యక్తి మృతదేహం

తాటిచెట్లపాలెం: గోపాలపట్నం ఆర్ఆర్ఐ క్యాబిన్ సమీపంలో శుక్రవారం ఉదయం గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో ఓ వ్యక్తి మరణించాడు. విశాఖ జీఆర్పీ ఇన్‌చార్జి సీఐ వెంకటరావు ఆదేశాలతో ఎస్ఐ జి.శ్రీనివాసరావు కేసు దర్యాప్తు చేపట్టారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. శుక్రవారం ఉదయం గోపాలపట్నం రైల్వేస్టేషన్ సమీపంలోని ఆర్ఆర్ఐ క్యాబిన్ వద్ద సుమారు 30–35 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతిచెందాడు. ఈ వ్యక్తి రైలు నుంచి జారిపడడం వల్ల గానీ, ట్రాక్ దాటే సమయంలో ఏదైనా రైలు ఢీకొనడం వలన గానీ మరణించి ఉండవచ్చు. మృతడి ఎత్తు సుమారు ఆరడుగులు. తెలుపు రంగు శరీరం, లైట్ గ్రీన్ కలర్ టీషర్ట్, బ్లూ కలర్ లోయర్ ధరించి ఉన్నాడు. ఇతడి వద్ద ఏవిధమైన ఆధారాలు లేవు. కుడి చేతి వేలికి తాబేలు ఆకారం గల రింగ్ ధరించి ఉన్నాడు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు విశాఖ రైల్వే స్టేషన్‌లోని పోలీసులకు స్వయంగా గానీ లేదా 98664 13487, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని ఎస్ఐ శ్రీనివాసరావు కోరారు.

బాలుడి అదృశ్యంపై ఫిర్యాదు


అరుణ్‌కుమార్

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలుడు అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. రాంజీ ఎస్టేట్‌లో వాసుపల్లి సావిత్రి తన ఇద్దరు మనవలతో (కుమార్తె పిల్లలు) కలిసి నివసిస్తోంది. పెద్ద మనవడు అరుణ్‌కుమార్ గురువారం మధ్యాహ్నం నుంచి ఎక్కడికి వెళ్లాడో తెలియడం లేదని శుక్రవారం పోలీసులకు ఆమె ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.సాయి నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని వారు కోరారు.

యువతి అదృశ్యం


జానకి

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. పోలీసుల వివరాలిలా.. రెడ్డి కంచరపాలెం బాపూజీ నగర్‌కు చెందిన గువ్వాడ జానకి ఈ నెల 9వ తేదీ బుధవారం రాత్రి 10.15 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. యువతి తల్లి గువ్వాడ రూపవతి ఫిర్యాదు మేరకు శుక్రవారం కంచరపాలెం పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

కళాభారతిలో నేడు 'శ్రీకృష్ణ రాయబారం' బుర్రకథ

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం శ్రీకృష్ణ రాయబారం బుర్రకథ ప్రదర్శించనున్నామని వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు మంతెన సత్యనారాయణరాజు, డాక్టర్.వి.ఆర్.కె.రాంబాబు తెలిపారు. సాయంత్రం 6.30 గంటలకు తాడేపల్లిగూడెం కళాకారులచే బుర్రకథ ప్రారంభమవుతుందన్నారు. ఈ ప్రదర్శనకు అందరూ ఆహ్వానితులేనని, తిలకించి ఆనందించాలని వారు కోరారు.

హెచ్‌ఐవీ బాధితులకు ప్రత్యేక సేవలు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: హెచ్‌ఐవీతో జీవిస్తున్న పిల్లలు, గర్భిణులకు ప్రత్యేక సేవలు అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. ఏపీ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు జిల్లాల సిబ్బందితో శుక్రవారం నగరంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. హెచ్‌ఐవీ బాధితులకు ఎలా సేవ చేయాలన్న దానిపై సిబ్బందికి శిక్షణ కూడా ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్, ఎయిడ్స్ నియంత్రణ అధికారి డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ క్రిస్టఫర్, డాక్టర్ ప్రభ, మేనేజర్ శైలజ, సూపర్‌వైజర్ భద్రి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ డిమాండ్

రహదారిలో ప్రైవేటు బోరు


మహారాణి వీధిలో రోడ్డుపై వేసిన బోరు మోటర్

కంచరపాలెం: జీవీఎంసీ 54వ వార్డు 104 ఏరియా పరిధి మహారాణి వీధిలో ఓ వ్యక్తి తన ఇంటి ముందు బోర్ మోటారు వేశారు. ప్రజలు నడిచి వెళ్లే మార్గంలో బోరు వేయడంతో అటుగా ప్రయాణించే ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. బోరు గొట్టాలు కాలువ మీదుగా వెళ్లడంతో మురుగు ప్రవాహానికి అడ్డంగా ఉండటంతో చెత్తాచెదారం రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. సంబంధిత అధికారులు పరిశీలించి చర్యలు తీసుకోవాలి.

– ఎస్.గోపాల్‌రెడ్డి, మహారాణి వీధి

రోడ్డెక్కిన మురుగు నీరు


బాలయ్యశాస్త్రి లేఅవుట్ స్టేట్ బ్యాంక్ రోడ్డులో లీకవుతున్న మ్యాన్‌హోల్

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని స్టేట్ బ్యాంకు రోడ్డులో యూజీడీ మ్యాన్‌హోల్ తరచూ లీకై పొంగి పొర్లుతోంది. రహదారిపైకి మురుగు నీరు చేరడంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. భరించలేని దుర్వాసనతో ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. నెల రోజులుగా మ్యాన్‌హోల్ లీకవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారని మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని పలువురు కోరుతున్నారు.

ఫైనాన్షియల్ మార్కెట్‌పై అవగాహన


ప్రసంగిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

ఏయూక్యాంపస్: స్టాక్ మార్కెట్‌లో అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని స్టీల్ సిటీ సెక్యూరిటీస్ లిమిటెడ్ సీఈవో డాక్టర్ సతీష్‌కుమార్ ఆర్య అన్నారు. ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో శుక్రవారం ఫైనాన్షియల్ మార్కెట్ సర్వీసెస్‌లో అవకాశాలు అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. జీఎంఆర్ సంస్థల అధినేత గ్రంధి మల్లికార్జున రావు, అపోలో హాస్పిటల్స్ అధినేత ప్రతాప్‌రెడ్డిల జీవితాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సంస్థ సీనియర్ మేనేజర్ కె.రాజేశ్వర రెడ్డి స్టాక్ మార్కెట్, షేర్లు, ఇన్సూరెన్స్, మ్యూచువల్ ఫండ్స్ తదితర అంశాలను వివరించారు. ఫండ్‌ల నిర్వహణపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ మేనేజర్ వై.సాంబమూర్తి ఇంటర్న్‌షిప్‌ల అందించే విధానాన్ని వివరించారు. మూలధనాన్ని ఏ విధంగా వినియోగించడవచ్చు, జ్ఞానాన్ని సంపదగా మార్చుకోవడం ఎలా అనే విషయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య జాలాది రవి, ఆచార్య ఎన్.సాంబశివరావు, డాక్టర్ బి.సుబ్బయ్య, సురేష్, బుజ్జిబాబు తదిరతులు పాల్గొన్నారు.

రోల్‌బాల్ పోటీలకు మురళీనగర్ క్రీడాకారులు


రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

మురళీనగర్: మురళీనగర్ స్కేటింగ్ రింక్‌లో సాధన చేస్తున్న మురళీనగర్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి రోల్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు కోచ్ పి.సంతోష్ తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ఈ పోటీలకు అండర్–14 బాలికలు, బాలుర విభాగానికి ఎంపికైన వీరు మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు నుంచి శుక్రవారం బయలు దేరారు. పార్కు అధ్యక్షుడు సనపల వరప్రసాద్, కార్యదర్శి నాగరాజు, శాంతి భూషణం, నిర్వాహకురాలు లలితప్రియ వీరికి శుభాకాంక్షలు తెలిపారు.